# మారని నోటు

విజయవాడనుంచి బయలుదేరిన గోలకొండ ఎక్స్‌ప్రెస్ "ఐదునిమిషాలలో బయలుదేరబోతున్నద"ని ప్రకటన విన్నతరువాత ప్రయాణీకులు ఉరుకుపరుగుల మీద ఒకరినొకరు తోసుకుంటూ రైలుపెట్టెలలోకి ఎక్కడం మొదలుపెట్టారు. వార్తాపత్రికలూ తినుబండారాల అమ్మకందారుల కేకలూ అధికమయ్యాయి.

ప్లాట్ ఫారమంతా సందడిగా ఉంది.

రైలు బయలుదేరబోయే సమయంలో ఒకయువతి తోసుకుంటూ ఒకపెట్టెలోకి ఎక్కి సీటుకోసం ఇటూ అటూ చూడటం మొదలుపెట్టింది.

ఆ రైలుపెట్టె చాలా కిక్కిరిసి ఉంది.

యువకులు చాలామంది తమసీట్లలో కూర్చుని ఉద్రేకంతో కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళచేతుల్లో చీట్లపేకలుఉన్నాయి. రైలు కదిలింతరువాత ఆట మొదలు పెట్టాలని ఆత్రపడుతున్నారు.

ఆమె నిలబడగా చూసిన ఒక ప్రయాణీకుడు తనుకూడా ఆటలో పాల్గొనాలన్న ఉబలాటాన్ని అణచుకుని, తన చిన్నసూటుకేసు తీసుకుని, పైబర్తుమీదికి వెళ్ళి "కూర్చోండి మేడమ్'' అన్నాడు ఎంతో గౌరవంతో.

అంతలో రైలుబండి ఇక బయలుదేరుతున్నానన్నట్టుగా ఒకచిన్న జెర్కుతో కదిలినట్లయింది.

సరిగ్గా అప్పుడే ఒకబేరర్ ఆమె అంతకుముందు ఆర్డరుచేసిన బ్రేక్‌ఫాస్టు ట్రేలోపెట్టి తీసుకువచ్చి ఆమెముందర పెట్టాడు. రైలు కదిలింది. బేరర్ వెళ్ళిపోయాడు.

యువకులు ఉత్సాహంతో సర్దుకుని కూర్చున్నారు. పేకాట ప్రారంభించారు ఏకాగ్రతతో.

ఆ తరువాత ఆగిన స్టేషన్‌లో బేరరువచ్చి కాఫీ ట్రే తీసుకుంటూ, బిల్లు ఆమెచేతిలోపెట్టాడు. ఆమె తన పొడవైన వేళ్ళతో చేతికి తగిలించుకున్న హాండ్ బాగ్ తెరిచి, దానిలోని అరలన్నీ వెతికింది. ఏభయి రూపాయలనోటు చేతికి తగిలింది. వెంటనే ఆమె దానిని పైకితీసి "దీనికి చిల్లరఉందా ?" అడిగింది బేరర్‌ను హిందీలో ఒయ్యారంగా.

అతడు జేబులు తడిమిచూసుకుని తనదగ్గర లేదన్నాడు- రైలు కదలబోతున్నదన్న తొందరలో.

ఆమె ఆనోటును వేళ్ళమధ్య పట్టుకుని "మీదగ్గర దీనికి చిల్లరఉందా ?" తోటి ప్రయాణీకులను అడిగింది.

మొదటినుంచీ ఆమె అత్యంతాధునిక వేష భాషలనూ, నాజూకుతనాన్నీ, కన్నార్పకుండా చూస్తున్న యువకుడు కష్టంలో ఉన్న ఆమెను ఆదుకుందామన్న ఉత్సాహంతో జేబులు తడుముకుని "సారీ మేడమ్. నాదగ్గర ఆనోటుకు సరిపడా చిల్లర లేద"న్నాడు.

ఆమె రైలుపెట్టె ఎక్కినప్పటినుంచీ రెండుబెంచీలు ఆక్రమించుకుని, చాయ్‌తాగి తమలపాకు కిళ్ళీవేసుకుని సిగిరెట్టు ముట్టించి, కబుర్లలో మునిగిపోయిన యువకబృందాన్ని ఓరగంటితో గమనిస్తునే ఉంది.

యువకులు ప్రపంచాన్ని మరచి ఆటలో మునిగిఉన్నారు. ఆటలో గెలిచినవాళ్ళు కేకలుపెడుతూ నవ్వుతూ ఓడిపోయినవాళ్ళను గేలిచేస్తున్నారు. వారిలో ఒక యువకుడు ఆమె అడిగిన చిల్లరకోసం తనజేబులన్నీ వెతుక్కున్నాడు. ఆమెకు తను సహాయం చేయలేకపోయానన్న బాధతో తన ప్యాంట్ జేబులోఉన్న రూపాయ నోట్లు కొంతచిల్లరతీసి "మీకెంతకావాలి మేడమ్" అడిగాడు.

"ఐదున్నర రూపాయలు" అన్నాడు బేరర్.

"నోటుమార్చినప్పుడు నాకియ్యవచ్చు" అంటూ ఆ యువకుడు లెక్కబెట్టి ఐదున్నర రూపాయలు బేరర్‌కిచ్చిపంపాడు.

అతడికి పట్టలేనంత సంతోషంగాఉంది- ఆమెకు తను సమయానికి సహాయం చెయ్యగలిగినందుకు. ఆమెకూడా అతడుచేసిన సహాయానికి ఒయ్యారంగా "థాంక్యూ" అన్నది.

అతడు నిజానికి ఆటలో పాల్గొన్నవాడుకాదు. ఆటను గమనిస్తూ గెలిచిన వాళ్ళతో నవ్వుతూ, ఓడినవాళ్ళను మొదట హేళనచేసి నవ్వినా "బెటర్‌లక్ నెక్స్ట టైమ్" అని భుజంతట్టి ధైర్యం చెప్పేవాడు.

ఆమె కత్తిరించిన తలవెంట్రుకలు ఆమె తలకదిలించినప్పుడల్లా విచిత్రంగా కదులుతున్నాయి. ఆమె స్లీవ్‌లెస్ జాకెట్టూ ఆమె తెల్లటి గుండ్రటి భుజాలూ అందరికళ్ళకూ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఆమెకట్టిన నైలాన్ సిల్కు చీరె గాలికి రెపరెపలాడుతున్నది. గోళ్ళకువేసుకున్న రంగువల్ల చేతివేళ్ళు లేతబెండకాయల్లా పొడుగ్గా కనుపిస్తున్నాయి. ఆమె మెడలోని ముత్యాలహారం మెడ కదిలించినప్పుడల్లా ఆకర్షణీయంగా కదులుతోంది.

వీటన్నిటినీ ఆటతోపాటు మధ్య మధ్య గమనిస్తున్నాడాయువకుడు.

ఆటలో పాల్గొన్న యువకులలో ఒక్కడుకూడా ఇటువైపు చూడటంలేదు. మాటలతో ఒకటే హోరెత్తిస్తున్నారు. వాళ్ళ సంభాషణలలో ప్రముఖ క్రీడాకారులైన గవాస్కర్ కపిల్‌దేవుల పేర్లు తరుచుగా దొర్లుతున్నాయి. ఆ సంభ్రమంలో మనసు పెట్టి ఆడలేనివాళ్ళు ఓడిపోతున్నా అంతగా బాధపడకుండా ఓటమిని స్పోర్టివ్‌గా తీసుకుంటున్నారు.

ఆమె ఒక ఇంగ్లీషువారపత్రికను చేతబట్టుకుని ప్రకటనల పేజీలను తిలకిస్తోంది. ఆ వారపత్రికలో ప్రత్యేకంగా స్త్రీలకుపయోగించే ప్రకటనలే ఎక్కువగా ఉన్నాయి. వాటినేచూస్తూ మధ్యమధ్య చేతికున్న గడియారాన్ని చూసుకుంటున్నది. ఆమె స్థిమితంగా కూర్చోక ఇటూఅటూ కదులుతూ కిటికీలోంచి చూస్తున్నందువల్ల ఆగబోయే స్టేషన్‌కోసమేమోనన్నట్టుగా ఉంది.

అంతలో కాజీపేటవచ్చింది. పేకముక్కల ఆటగాళ్ళు రైలు ఆగినట్టుకూడా గమనించే స్థితిలోలేరు.

రైలు ఆగగానే టికెట్ కలెక్టరు లోపలికి ప్రవేశించి టికెట్ టికెట్ అంటూ చెయ్యి చాపుతున్నాడు. ప్రయాణీకుల ముందర నిలబడి ఒక్కొక్కరే జేబులు తడుముకుంటూ టికెట్లు బయటికి తీస్తున్నారు

టికెట్ కలెక్టరు ఆమెదగ్గరికివచ్చి "మేడమ్ టికెట్'' అన్నాడు.

ఆమె వెంటనే తడుముకోకుండా "మావారిదగ్గర టికెట్ ఉంది. మేమిద్దరం రైలు కదిలేటప్పుడు ఎక్కటంవల్ల చెరొకచోట అయిపోయాం. ఆయన అవతల కంపార్టుమెంటులో ఉంటారు. గ్రేసూట్లో పొడుగ్గాఉంటారు. దయచేసి అక్కడ అడగండి" అన్నది ఆంగ్లభాషలో.

"దట్సాల్‌రైట్" అంటూ అతడు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళగాచూసి ఆమె స్థిమితపడ్డది.

కాజీపేట పెద్దజంక్షను. అన్నివైపులకు వెళ్ళేరైళ్లూ అక్కడ కలుసుకుంటాయి. ప్రయాణీకులు రైళ్ళు మారుతూఉంటారు. పిల్లలతో సామాన్లతో పరుగులు తీస్తూఉంటారు. మధ్యలో- అమ్మకందార్లు గరంచాయ్ అంటూ కొందరూ, హిందూ ఎక్స్‌ప్రెస్, ఉదయం, ఆంధ్రప్రభ పత్రిక వారపత్రికలూ అంటూ కొందరూ పళ్ళు అని కొందరూ కేకలతో చెవులు హోరెత్తిస్తూఉన్నారు. రైళ్ళ రాకపోకలూ లౌడ్‌స్పీకరు ఎనౌన్సుమెంట్లవల్ల ఒకరిమాటలు ఒకరికి వినబడటం లేదు.

పేకాట యువకులు గరంచాయి తాగి కారాకిళ్ళీ బుగ్గనపెట్టుకుని ధూమపానంతో కొత్తఆటకు ఆయత్తమవుతున్నారు. పేకముక్కలు క్రాస్‌చేసి కలిపి అతివేగంగా పంచుతున్నాడొక యువకుడు.

ఆమెకు చిల్లరఇచ్చిన అతడు ఇంకా కొంతసేపు ప్రయాణం ఇలాగేసాగితే బాగుండుననుకుంటున్నాడు మనసులో.

రైళ్ళు కాజీపేటలో నీళ్ళు బొగ్గునింపుకుని బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నట్టు కూతలు వేస్తున్నాయి.

ఇంతకూ ఆరోజు గోలకొండ ఎక్స్‌ప్రెస్ అంతగా రష్‌గా ఉండటానికి కారణం ప్రత్యేకమైనదీ అతిముఖ్యమైనదీ మళ్ళీ ఇప్పట్లో సంభవంకానిది. ఆరోజు సాయంకాలము ఐదుగంటలకు లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రముఖ క్రీడాకారులైన గవాస్కర్ కపిల్‌దేవులకు ఘనమైన సన్మానం జరగబోతున్నది. వేరేపనిమీద వచ్చిన కేంద్రమంత్రి తనచేతిమీదుగాచేసే సన్మానమది. క్రీడాకారులను చూడాలన్న కుతూహలంతో కొందరూ, వాళ్ళ అభిమానులు పత్రికలలో చదవటం కాకుండా, కళ్ళతో కిక్కిరిసిఉన్న స్టేడియమ్నూ సన్మానితులనూ చూడాలన్న

కాంక్షతో కొందరూ, బయలుదేరిన ప్రయాణీకులు రైలు ఇంకా తొందరగాపోతే బాగుండునని ఆత్రపడుతున్నారు.

యువకులంతా ఆటను ముగించటానికి ఆయత్తమవుతున్నారు. ఆమెకు ఐదున్నర రూపాయలు ఎడ్వాన్సుచేసిన అతడిచూపులు ఆమెమీదనేఉన్నాయి.

ఆమెకు సామానులేదు. హాండ్‌బ్యాగ్ భుజానికి తగిలించుకునే, పత్రిక తిరగవేస్తున్నది. రైలు ఆగగానే దిగాలని.

ప్రయాణీకులలో అలజడి మొదలైంది. సికింద్రాబాదు స్టేషను వస్తున్నదని సామాను పైనుంచి దింపుకుని లెక్కచూసుకుంటున్నారు. ఆడప్రయాణీకులు నిద్ర పోతున్న పిల్లలను భుజాన వేసుకుని నిలబడ్డారు.

రైలు ఆగగానే అందరికీ ముందుగా తాము దిగాలన్న ఆత్రం. స్టేషన్ రాకముందే తలుపుతెరిచి పట్టుకుని నిలబడ్డారు- రైలు ఆగకముందే దిగిపోవాలని కూలీలు ప్రయాణీకులు దిగకముందే కూలీకూలీ అంటూ కేకలు పెడుతున్నారు. దడికట్టినట్టుగా నిలబడి.

సికింద్రాబాదు స్టేషన్ రాగానే ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకుంటూ దిగుతున్నారు.

అప్పటివరకూ వెయ్యికళ్ళతో కనిపెట్టిచూస్తున్న యువకుడు ఆమె ఆ సందడిలో ఎప్పుడు ఏదారిన దిగిపోయిందో చూడలేకపోయాడు.

ప్రయాణీకులందరూ ఎవరిదోవన వాళ్ళు తొందరగాదిగి స్టేషనుదాటి బయటికి వచ్చారు.

పేకాట బృందం తొందర తొందరగా అడుగులు వేస్తుంటే ఆమెకోసం దిక్కులుచూస్తూ అడుగులు వేస్తున్నాడు ఆ యువకుడు.

ఈ బృందాన్ని కలుసుకోవటానికి వాళ్ళమిత్రులు ఎదురుగా వచ్చారు. అందరూ బస్సుకోసం ఎదురుచూస్తున్నారు.

అంతలో ఒకటాక్సీలో ఆమె ఎక్కికూర్చోవటం తడవుగా బయలుదేరటం ఆ యువకుడి కంటబడ్డది. 'ఇన్నికళ్ళతో ఆమెకోసంచూస్తుంటే ఆమె ఎప్పుడు

రైలుదిగి, బైటికి వచ్చిందీ? ఆమెను కారులో తీసుకునివెళ్ళింది ఎవరు?' అనుకుంటూ ఆ యువకుడు కారువెళ్ళినవైపే దిగాలుపడిచూస్తున్నాడు.

"ఏమిట్రా అట్లాచూస్తున్నావు? ఆకారు వెళ్ళినవైపేనా?" అంటూ వీపు చరుస్తూ అడిగాడొక స్నేహితుడు.

అతడు దిగ్భ్రాంతిగాచూస్తూ 'అవును కాదు' అని చెప్పలేకపోతున్నాడు.

"ఆ కారులో కూర్చున్న ఆమెనే చూస్తున్నావు కదూ? ఏమయినా టోపీ పెట్టించుకున్నావా?" అడిగాడు మళ్ళీ అతడిని తనవైపు తిప్పుకుంటూ.

"అంతా తెలిసినట్టుగా అతడిని అట్లా నిలవదీసి అడుగుతున్నావు? నీక్కూడా అటువంటి అనుభవమేమయినా అయిందా?" అన్నాడు మరొకమిత్రుడు.

"కాదని ఎట్లాఅనను మీరింతమంది అడుగుతుంటే?" జవాబిచ్చాడతడు నవ్వుతూ.

"అది మనవాళ్ళ షి వెల్రీ" నవ్వాడు మరొకడు.

"ఓరే ఆనోటు మారేదికాదు" అన్నాడు ఇంకోమిత్రుడు.

అంతలో సిటీబస్సు వచ్చింది. "పదండి-పదండి గతజల సేతుబంధనం" భుజాలు చరుచుకుంటూ చిరునవ్వులు పెదాలకు మీదికి తెచ్చుకుంటూ బస్సు ఎక్కారందరూ.

❋❋